క్లుప్తంగా

ఆటోలతో ప్రయాణికుల ఇబ్బందులు



బస్టాండులో బస్సుకు అడ్డంగా నిలిపిన ఆటోలు

ఆత్మకూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఆటోలు విచ్చల విడిగా రాకపోకలు సాగిస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు నిలిపే సమయంలో ప్రయాణికులను ఎక్కించుకునేందుకే ఆటో డ్రైవర్లు పోటీ పడుతూ వేగంగా సమీపానికి వచ్చి సడన్ బ్రేక్‌లు వేస్తుండటంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. బస్టాండు బయట ఆటోలు నిలిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



మాట్లాడుతున్న ఎ.రణధీర్

ఆత్మకూరు: ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని చిన్నగుమ్మడాపురం గ్రామంలో సోమవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు పార్టీ గ్రామ కమిటీ కార్యదర్శిగా మలిరెడ్డి జ్ఞానసూరుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఏసురత్నం మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు సంజీవరాయుడు, స్వాములు, పార్టీ సభ్యులు సంసోను, కె.స్వాములు, చిన్న స్వామి, రాజు, లలితమ్మ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దాం

మహానంది: అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ కామేశ్వరీదేవి అమ్మవారికి అలంకార పూజలు, వాహనసేవలు, గ్రామోత్సవం సేవలు ఉంటాయన్నారు. రూ.13 వేలు చెల్లించి ఉభయదాతలుగా పాల్గొనవచ్చన్నారు. సమావేశంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, ఏఈఓలు వై.మధు, ఓంకారం వెంకటేశ్వరుడు, ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్ రెడ్డి పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కుమారుడు ఫిరోజ్‌పై ఆదివారం రాత్రి దాడికి యత్నించిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి.. ఫిరోజ్‌కు పలుమార్లు ఫోన్ చేసి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకల్లో భూమా బ్రహ్మానందరెడ్డి బ్యానర్‌ను ఎందుకు తొలగించారని ప్రశ్నించాడు. బ్యానర్లకు సంబంధించిన విషయం తనకు తెలియదని చెప్పినా వినకుండా మొండిగా వాదించటంతో అతని నంబర్‌ను ఫిరోజ్ బ్లాక్ లిస్ట్‌లో ఉంచాడు. రాత్రి రాజ్ థియేటర్ నుంచి ఫిరోజ్ కారులో ఇంటికి వెళ్తుండగా గేట్ దగ్గర వెంకటేశ్వరరెడ్డి అటకాయించి కారు అద్దంపై గుద్దటంతో ఫిరోజ్ కారులోంచి దిగాడు. దీంతో వెంటనే ఫిరోజ్‌పై దాడికి యత్నించగా.. అక్కడే ఉన్న టీడీపీ వర్గీయులు వెంకటేశ్వరరెడ్డికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఫిరోజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మహ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శనీయం

● ఘనంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు



ఆత్మకూరు మసీదులో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహిస్తున్న ముస్లిం మత పెద్దలు



వెలుగోడులో మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

ఆత్మకూరు: మహ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శనీయమని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. ప్రవక్త జన్మదిన వేడుకలను సోమవారం ఆత్మకూరులో ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. సంతమార్కెట్ సమీపంలోని ఆసార్ మసీదులో ముస్లింలకు మహమ్మద్ ప్రవక్త కేశ దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త శాంతి, ధర్మం, న్యాయం, అహింస మార్గంలో నడవాలని సూచించారన్నారు. అనంతరం ఆసార్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ముతవల్లి హాజీరహంతుల్లా, ఆసార్ సయ్యద్‌మాలిక్, హాజీ సుల్తాన్, ఖదీర్, సలాంబాషా, సొసైటీ హాజీ ఖాదర్, గౌస్‌పీరా, మహమ్మద్‌గౌస్ మౌలానా, ఖలీద్‌మౌలానా, సజ్జద్, కలీముల్లా, హాజీ మాలిక్, అమ్రుల్లా, హబీబ్, దస్తగిర్ పాల్గొన్నారు.

● **వెలుగోడు:** పట్టణంలో మిలాద్–ఉన్–నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఆసారు షరీఫ్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ముతవల్లులు పాల్గొని మహమ్మద్ ప్రవక్త గొప్ప తనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆసారు షరీఫ్, ముతవల్లులు ఆసారు వజీర్, ఖాజా మొయినుద్దీన్, ఈనాయతుల్లా, రఫీ, పాల్గొన్నారు.

● **పగిడ్యాల:** మిలాద్ ఉన్ నబీ వేడుకలు పగిడ్యాల, నెహ్రూనగర్, పాతముచ్చుమర్రి, కొత్త ముచ్చుమర్రి, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం, బీరవోలు తదితర గ్రామాల్లో ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయమే మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అమీర్‌సాహెబ్ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించాలని సూచించారు.

● **కొత్తపల్లి:** మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో మిలాద్‌ఉన్‌నబీ పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. శివపురం, ముసలిమడుగు, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, గ్రామాలతోపాటు కొత్తపల్లి మండల కేంద్రంలో ముస్లింలు మసీదులకు చేరుకుని ఒకరికొకరు ఆలింగనంచేసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

● **పాములపాడు:** మహ్మద్‌ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు సోమవారం మిలాద్ ఉన్ నబీ పండుగను ప్రత్యేక ప్రార్థనలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రపంచ శాంతికి ఆ మహనీయుడు చూపిన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరూ దైవ సన్నిధిలో, దైవ చింతనతో జీవించాలని మత గురువులు సూచించారు. మహ్మద్ ప్రవక్త బోధించిన పలు విషయాలను తెలిపారు. అనంతరం దువాతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సోదరభావంతో మెలగాలి



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల సోదరభావంతో మెలగాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. మండ్లెం గ్రామంలోని మసీదులో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధర్మ చింతనతో పాటు తోటివారి పట్ల ప్రేమను కలిగి ఉండాలని ప్రవక్త సూచించారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ, సివిక్స్ సబ్జెక్టులను బోధించేందుకు ఆసక్తి ఉన్న నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.మారెన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎం.ఏ(హిస్టరీ)లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందినవారు అర్హులని, ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. వేతనంనెలకురూ.10 వేలు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్. 94414 08498, 9985858587 సంప్రదించాలన్నారు.

మల్లన్నకు సహస్ర దీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్ర దీపార్చన సేవను నిర్వహించింది. ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్ర దీపార్చన పూజలు జరిపించారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

19న మండలస్థాయి స్కూల్ గేమ్స్

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 19న మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ మండల కో–ఆర్డినేటర్ ఎస్.శంకర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న క్రీడాకారులను క్రీడల్లో పాల్గొనేలా వ్యాయామ ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

రైతులను ఆదుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

కొత్తపల్లి: ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతన్నలను ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆదుకోవాలని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన శివపురం సమీపంలోని కొలనుభారతి దేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన అధిక వర్షాలకు వేల ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. క్షేత్రస్థాయిలో పంటనష్టం అంచనా వేయించి నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. శివపురం, లింగాపురం గ్రామాల మధ్య ఎద్దులేరు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. నందికుంట సమీంలోని సుద్దవాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. కొలనుభారతిదేవి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో కో–ఆప్టెడ్ మెంబర్ షేక్ మహమ్మద్ గౌస్, కొక్కెరంచ సర్పంచు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

మిడుతూరు: స్థానిక ఏబీఎం చర్చి, అనుబంధ సంఘాలు సుంకేసుల, వీపనగండ్ల నాగలూటి సంఘాల నుంచి రూ.లక్ష నగదు, రూ.50 వేల విలువైన నిత్యావసర సరుకులను పంపించినట్లు స్థానిక సంఘ కాపరి ఇమ్మానుయేల్ సోమవారం తెలిపారు. విజయవాడలోని 59వ డివిజన్, సీతారాం నగర్, అజిత్ సింగ్ నగర్‌లలో దాదాపు 400 కుటుంబాలకు నిత్యావసర సరుకులు(బియ్యం, కంది పప్పు, నూనె, కూరగాయాల కిట్లను) అందజేసినట్లు తెలిపారు. వరద బాధితులకు సహాయం అందజేసిన మిడుతూరు, సుంకేసుల, నాగలూటి, వీపనగండ్ల సంఘస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

మల్లన్న సేవలో బాంబే హైకోర్టు న్యాయమూర్తి



బాంబే హైకోర్టు న్యాయమూర్తి దంపతులను సత్కరిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినయ్ జోషి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సోమవారం సాయంత్రం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన బాంబే హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో బాంబే హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణం



మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం నిత్య కల్యాణోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు. ఈశ్వరుడికి సోమవారం ప్రీతికరమైన వారం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సాధారణ, ఉచిత, శీఘ్రదర్శనం క్యూలైన్లు, మహామంగళ హారతుల సేవా సమయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

స్వచ్ఛతా సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

మిడుతూరు: ప్రతి గ్రామ పంచాయతీలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి సూచించారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామ పంచాయతీల్లో నిర్వహించే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు.

నిందితులకు రిమాండ్

పగిడ్యాల: అక్రమ మద్యం తరలింపు కేసులో పట్టుబడిన ఇద్దరు నిందితులను సోమవారం నందికొట్కూరు జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని ముచ్చుమర్రి ఎస్ఐ సి. శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పడమర ప్రాతకోట గ్రామానికి చెందిన గంగి నరేంద్రప్రసాద్, నల్లబోతుల చరణ్ ఆదివారం రాత్రి పగిడ్యాల నుంచి 58 మద్యం బాటిళ్లను బైక్‌పై తరలిస్తున్నారనే సమాచారంతో లక్ష్మాపురం అంచె వద్ద మాటు వేసి నిందితులను పట్టుకున్నామన్నారు. వారి వద్ద లభించిన మద్యం బాటిళ్లతోపాటు బైక్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించనట్లు ఎస్ఐ తెలిపారు.

కల్వర్టు శిథిలం.. నిలిచిన నీటిప్రవాహం



కల్వర్టు శిథిలం కావటంతో నిలిచిన పోయిన నీటి ప్రవాహం

జూపాడుబంగ్లా: తాటిపాడు గ్రామంలోని ప్రధాన రహదారిపై పంట కాల్వకు అనుసంధానంగా ఉన్న కల్వర్టు శిథిలం కావటంతో నీటిప్రవాహం నిలిచిపోయింది. కేసీ కాల్వ 97వ తూముకు అనుసంధానంగా పంట కాల్వ ఉంది. ఇది గ్రామంలో నుంచే వెళ్తుండగా 30 ఏళ్ల క్రితం కల్వర్టును నిర్మించి ప్రధాన రహదారిని నిర్మించారు. ఈ దారి గుండానే నిత్యం వ్యవసాయ పొలాలకు ఎద్దుల బండ్లు, లారీలు, ట్రాక్టర్లు తదితర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు కావడంతో కుంగిపోయింది. దీంతో కాల్వలోని నీరు దిగువకు వెళ్లడం లేదు. నూతన కల్వర్టును నిర్మించి రాకపోకలకు అంతరాయం లేకుండా, నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని తాటిపాడు గ్రామస్తులు కోరుతున్నారు.

రెండేళ్లుగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓలే దిక్కు

● సకాలంలో పరిష్కారం కాని సమస్యలు
● ఇబ్బంది పడుతున్న ప్రజలు



జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయం

జూపాడుబంగ్లా: రెండేళ్లుగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓలే మండల ప్రజలకు దిక్కయ్యారు. దీంతో సకాలంలో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండేళ్ల క్రితం ఇక్కడి ఎంపీడీఓ మంజులవాణి డిప్యుటేషన్‌పై జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారిణిగా వెళ్లారు. దీంతో ఈఓపీఆర్డీకే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఏఓ నూర్జహాన్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొనసాగుతున్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓలు సమస్యలను సకాలంలో పరిష్కరించడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా సాధారణ ఎన్నికల విధుల నిమిత్తం జిల్లాలోని ఎంపీడీఓలు ఇతర జిల్లాలకు వెళ్లారు. కోడ్ ముగియగానే స్వంత జిల్లాకు వచ్చారు. ఇక్కడి జిల్లా అధికారులు ఎంపీడీఓలకు స్థానాలు కేటాయించారు. అయితే జూపాడుబంగ్లా క్లియర్ వెహికెన్సీ లేకపోవడంతో రెగ్యులర్ ఎంపీడీఓను కేటాయించేందుకు అవకాశం లేకపోయింది. దీంతో మండల ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. డిప్యుటేషన్‌ను రద్దు చేసి మంజులవాణిని ఎంపీడీఓగా కొనసాగించాలని, లేకపోతే వేరొకరినైనా రెగ్యులర్ ఎంపీడీఓను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పొగతాగితే జరిమానా

మహానంది: మహానంది ఆలయ పరిసరాలతోపాటు గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం(పొగతాగడం) సేవిస్తే జరిమానా విధిస్తామని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి సోమవారం హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడదాం

ఆత్మకూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడదామని మాల మహానాడు జిల్లా నాయకులు సాంబశివుడు, రోజక్కబెలల రాజగోపాల్, బాలరాజు, నగేష్ అన్నారు. సోమవారం మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు శీలం శేషు, జిల్లా అధ్యక్షులు మురమరి మల్లయ్య ఆధ్వర్యంలో పాత బస్టాండులోని అంబేడ్కర్ భవనంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా వెలువడే తీర్పులు నిలబడవన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రివ్యూ పిటీషన్ వేసినట్లు చెప్పారు. మళ్లీ అదే కోర్టులో అదే జడ్జిల ద్వారానే ఎస్సీ వర్గీకరణ చెల్లదనే తీర్పు వచ్చేంతవరకు మాలలు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. సమావేశవలో నాయకులు శీలం శేషు, మురహరి మల్లయ్య, రాష్ట్ర నాయకులు మల్లే ఎలీషా, రాఘవేంద్ర, మహేష్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని మృతి



షేక్ రుక్సానా మృతదేహం

బేతంచెర్ల: ఎక్కువ సేపు ఫోన్‌లో మాట్లాడుతోందని కళాశాల యాజమన్యం మందలించడంతో ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని ఆరోగ్యం విషమించడంతో సోమవారం మృతిచెందింది. ఏఎస్ఐ లింగమయ్య వివరాల మేరకు.. బేతంచెర్ల సిమెంట్ నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ బాషా, ఫాతిమా కుమార్తె షేక్ రుక్సానా(19) వైఎస్సార్ జిల్లాలోని అయ్యవారు రెడ్డి కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కళాశాలలో ఎక్కువ సేపు ఫోన్ వినియోగిస్తుండడంతో యాజమాన్యం మందలించింది. నెల పాటు కళాశాల నుంచి సస్పెండ్ చేసింది. దీంతో ఇంటికి వచ్చిన షేక్ రుక్సానా మనస్తాపానికి గురై ఈనెల 13వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలకు పూసుకునే సూ పర్ వాస్మోలిన్ తాగింది. అప స్మారక స్థితిలో పడివున్న ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అయితే ఆరోగ్యం విషమించడంతో మృతి చెందింది. మృతురాలి తల్లి ఫాతిమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

దోమల నివారణకు చర్యలు



దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామంలో సర్పంచు షేక్ నాజియ ఆధ్వర్యంలో సోమవారం దోమల నివారణకు చర్యలు చేపట్టారు. మురుగు నీరు నిలవకుండా అధికారులు చర్యలు చేపట్టారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు సాయంత్రం ఫాగింగ్ చేయించారు.

● **మహానంది:** స్థానిక ఈశ్వర్‌నగర్, దేవస్థానం కాలనీ, పార్వతీపురం కాలనీల్లో సర్పంచ్ చలంచలం శిరీష ఆధ్వర్యంలో సోమవారం రాత్రి దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు.

దోమతెరలు, దుప్పట్ల పంపిణీ

మహానంది: అబ్బీపురం గ్రామంలోని గిరిజనులకు సోమవారం సాయంత్రం బెంగళూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ పాండురంగారావు సమక్షంలో దోమతెరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, డాక్టర్ రాజశేఖర్, నాబార్డు అధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

కొత్తపల్లి: గ్రామాలలో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. దుద్యాల గ్రామంలో సోమవారం రాత్రి ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులంతా కలిసి ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తలకు హెల్మెట్ వాడాలన్నారు. లైసెన్స్ లేని వారికి, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ఆయన వెంట ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ ఎం.కేశవ ఉన్నారు.

నిందితులపై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న నరసింహ నాయక్

ఆత్మకూరు: కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండలం కల్లకుంట గ్రామంలో మహిళను కరెంట్ స్తంభానికి కట్టేసి, విచక్షణారహితంగా దాడి చేసి సామాజిక హింసకు పాల్పడిన వారిపై తక్షణమే కేసు నమోదు చేయాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, నాయకులు రామ్‌నాయక్‌లు డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ కలెక్టర్, ఎస్పీ ఘటనపై స్పందించాలని కోరారు. ఆరు నెలల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడన్న కారణంతో మహిళ కుమారుడిని పోలీసుల సమక్షంలోనే గ్రామపెద్దలు గ్రామ బహిష్కరణ చేయడం సిగ్గుచేటన్నారు. ఈనెల 12న తల్లీ, కుమారుడు గ్రామానికి రావడాన్ని జీర్ణియించుకోలేని ఆదిపత్య కులాలకు చెందిన వారు మహిళను నిర్బంధించి దాడి చేశడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకుని, మహిళకు ప్రత్యేక భద్రత కల్పించాలన్నారు.

బవనాసి వాగుపై వంతెన నిర్మించాలి

ఆత్మకూరు: ఆత్మకూరు నుంచి కొత్తపల్లి మండలానికి వెళ్లే దారిలో బవనాసి వాగుపై వంతెన నిర్మించాలని సామాజిక కార్యకర్త జవహర్‌నాయక్ సోమవారం అధికారులను కోరారు. భారీ వర్షాలకు నీటి ప్రవాహం అధికమై కురుకుంద, కొట్టాల చెరువు గ్రామాల ప్రజలు, కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు.

ఉచిత కర్రసాము శిక్షణ



కర్రసాములో పాల్గొన్న చిన్నారులు

నంద్యాల(న్యూటౌన్): కర్రసాము పిల్లల్లో ధైర్యసాహసాలు పెంపొందిస్తుందని శిక్షకుడు ఆంజనేయులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్‌బీఐ కాలనీలోని రామాలయంలో చిన్న పిల్లలకు ఉచిత కర్రసాము, కత్తిసాముపై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అలాగే..సెలవు రోజుల్లో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు హనుమాన్ చాలీసా, ఓంకారం నేర్పిస్తామని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.